క్లుప్తంగా

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

గంగాధర: మండలంలోని కోట్ల నర్సింహులపల్లిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నందగిరి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు ఉదయం అగ్నిగుండాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీవీరభద్రస్వామి వారికి అన్నపూజ, తీర్థప్రసాద వితరణతో ఉత్సవాలు ముగించారు. ఐదు రోజులుగా నిర్వహించిన ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చినట్లు సర్పంచు కవిత పేర్కొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల నిరసన

హుజూరాబాద్: పట్టణంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వసతులతో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలను తరలించవద్దన్నారు. గురుకుల పాఠశాలను వేరే ప్రాంతానికి తరలిస్తే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలకు గురయ్యే అవకాశం ఉందని సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాఠశాలను తరలించవద్దంటూ డీసీవోకు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో నాయకులు రామారపు వెంకటేశ్, గజ్జెల సందీప్, మొలుగూరి హరికృష్ణ, దేశబోయిన రాముయాదవ్, సందీప్, అంబాల సందేశ్, సారపాక సాయికుమార్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన మడ్డి సాంబయ్య అనే గీత కార్మికుడు ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంటలోని ఆసుపత్రిలో చికిత్సపొంది, ఇంటికి వచ్చాడు. బాధితుడిని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఒల్లాల సాంబయ్య, మండల గౌరవ అధ్యక్షుడు మడ్డి తిరుపతి, మండల యూత్ అధ్యక్షుడు మడ్డి బాలకృష్ణగౌడ్, నాయకులు పల్లెర్ల సదానందంగౌడ్, బుర్ర శ్రీనివాస్, రవిగౌడ్, మడ్డి సారంగపాణి పరామర్శించారు. సాంబయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మున్సిపల్ సిబ్బంది నోటీస్ జారీ



చొప్పదండి: పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన సంబోజీ సునీల్ తన సొంత ప్లాట్‌ను శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ సిబ్బంది నోటీస్ జారీచేసినట్లు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. 10 రోజుల క్రితం సునీల్ ఫిర్యాదు చేయడంతో పారిశుధ్య పనులు చేపట్టామని, ప్రస్తుతం ఆ స్థలంలో పిచ్చిమొక్కలు మొలిచి అపరిశుభ్రంగా మారిందని సునీల్ ఇంటిస్థలాన్ని మోఖాపై పరిశీలించామన్నారు. మళ్లీ ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా సదరు వ్యక్తికి నోటీసులు జారిచేసినట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ కొత్తూరి మహేశ్, ఎస్.రాజేశం అంజయ్య, అమర్, తదితరులున్నారు.

నిందితులను అరెస్టుచేయాలి



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఇల్లందకుంట: కులంపేరుతో దూషించి దాడిచేసిన కేసులో నిందితులను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడంలేదని, కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించాలని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మేడి మహేశ్, ఎలుక అంజనేయులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 10న టీకుర్తికి చెందిన భోగం స్వరూపపై తోడేటి సంజీవ్ అతని కుటుంబ సభ్యులు ఉద్దేశపూర్వకంగానే కులంపేరుతో దూషిస్తూ, దాడిచేశారన్నారు. ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసునమోదు కాగా ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి విచారణ చేపట్టారు.

రెండు ఆలయాల్లో చోరీ



పగులగొట్టిన హుండీ

చొప్పదండి: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం, పెద్దమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుధవారం భక్తులు వచ్చే సరికి హుండీలు పగలగొట్టి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ప్రతీయేటా హుండీల దొంగతనం కొనసాగుతోందని స్థానిక భక్తులు వాపోయారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారని, చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



గుంతలతో దర్శనమిస్తున్న గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు



నగునూరు శివారులో వేసిన రోడ్డు

- మంత్రుల ఏరియాలో నూతన రోడ్డు
- మరమ్మతులకు గురవుతున్న రోడ్లు
- రాష్ట్ర రహదారి మరమ్మతుల్లో నిర్లక్ష్యం
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

చొప్పదండి: మంత్రులు ఉన్న ఏరియాలో మరమ్మతులు, ఎమ్మెల్యే ఉన్న ఏరియాలో గుంతలు.. ఒకే రాష్ట్ర రహదారిపై భిన్నమైన విధానం అవలంభిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ నుంచి రాయపట్నం వరకు ఉన్న రాష్ట్ర రహదారి మరమ్మతుల విషయంలో చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని రోడ్డు మరమ్మతులపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ రోడ్డుపై కరీంనగర్ నుంచి నగునూరు వరకు ఉన్న రహదారి మంత్రి గంగుల కమలాకర్ పరిధిలో ఉండగా ఇటీవల పూర్తిస్థాయి మరమ్మతులు చేసి నూతనంగా రోడ్డువేశారు. ఇక మరో మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిధిలోని ధర్మారం, వెల్గటూరు మండలాల్లో కూడా రాష్ట్ర రహదారి ధ్వంసమైన చోట మరమ్మతులు చేపట్టారు. చొప్పదండి మండల పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కరీంనగర్ రూరల్, ధర్మారం మండలాల్లోరోడ్డుమరమ్మతులు పూర్తిచేసిన అధికారులు చొప్పదండి నియోజకవర్గం పరిధిలో మాత్రం మొండిచేయి చూపడం విమర్శలకు తావిస్తోంది.

ఎప్పటిలాగే గుంతలు

చొప్పదండి మండలంలోని సుమారు 16 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారిపై గత కొన్నేళ్లుగా గుంతలు పెద్దగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కూడా మండలంలోని కొలిమికుంటలో గుంతలను పరిశీలించి మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశించారు. స్పందించిన అధికారులు కొలిమికుంట చెరువు సమీపంలో వందమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేశారు. దీంతో మండలంలోని ఆర్నకొండ, కొలిమికుంట, రుక్మాపూర్ గ్రామాల పరిధితో పాటు, చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పడిన గుంతలు అలాగే ఉండిపోయాయి. మరమ్మతులు ప్రారంభించారని సంతోషించే లోపు పనులు నిలిపివేయడంతో ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుంతలు ఎప్పటిలాగే ఉండడంతో వాహనదారులు రాంగ్‌రూట్లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్నకొండ బస్టాండ్, చొప్పదండిలోని గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద, పెట్రోల్‌బంకు వద్ద, కొలిమికుంటలోని బస్టాప్‌వద్ద, రుక్మాపూర్‌లోని మిల్లు వద్ద రోడ్డును తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏటా మరమ్మతులే..

రాష్ట్ర రహదారిపై చేపడుతున్న మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటే అవుతున్నాయి. కాంట్రాక్టర్లు లాభాపేక్షతో పనులు చేపడుతుండడంతో ధ్వంసమైన చోటచేస్తున్న రోడ్డు మరమ్మతులు నాసిరకంగా మారుతున్నాయి. దీంతో ప్రతియేటా రోడ్డు మరమ్మతులకు ఎదురుచూడాల్సి వస్తోంది. రోడ్డు నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర రహదారికి మరమ్మతుల గండం ఏర్పడింది. అధికారులు స్పందించి నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



రామంచలో పంటను పరిశీలిస్తున్న ఏవో రంజిత్



పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

శంకరపట్నం: యాసంగి వరిసాగుకు తెగుళ్లు సోకి రైతులకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ ఆరోపించారు. మండలంలోని ఇప్పలపల్లి, అంబాల్‌పూర్, కేశవపట్నం గ్రామాల్లో బుధవారం మొగిపురుగు సోకిన వరిపంటలను పరిశీలించారు. వరినాట్లు వేసిన నెల రోజులకే తెగుళ్లు సోకి నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సదానందం, రవి, తిరుపతి,నరేశ్‌లు ఉన్నారు.

వరిపంటల పరిశీలన

శంకరపట్నం మండలంలోని ధర్మారం, కన్నాపూర్, అర్కండ్ల గ్రామాల్లో బుధవారం వరిపంటలను కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. మొగిపురుగు నివారణకు తీసుకోవాలల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవో సుమాంజలి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

తెగుళ్లపై రైతులకు అవగాహన

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వరిపంటలో వచ్చే తెగుళ్లపై జమ్మికుంట కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ మహేశ్ రైతులకు అవగాహన కల్పించారు. వరిపంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటను ఆశించిన వేరుకుళ్లు, కాండం తొలుచుపురుగు, జింకులోపం, ఆకుముడుత పురుగు నివారణ చర్యలపై వివరించారు. సకాలంలో రైతులు తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వారివెంట వ్యవసాయ అధికారి గణేశ్, ఏఈవో రాకేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతాంగం వరిపంటకు సోకుతున్న కాండం తొలుచు పురుగు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో కె.రంజిత్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని రామంచ, అర్కాలపల్లె, అంటకాలపల్లె గ్రామాల్లో వరినాట్లను పరిశీలించి మాట్లాడారు. నాటు వేసే కంటే వారం రోజుల ముందుగానే క్రిమిసంహారక మందులు చల్లుకోవాలని కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు రైతులకు వివరించారు. మొక్కజొన్నకు సోకుతున్న కత్తెర పురుగు నివారణ చర్యలు సూచించారు. ఏఈవో సతీశ్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

సైదాపూర్: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వెన్నంపల్లిలో సారబుడ్ల భగవాన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డిల 10 ఎకరాల భూమిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు మొక్కలను సబ్సిడీపై అందించి ప్రోత్సహిస్తోందని ఎంపీపీ అన్నారు. మూడేండ్లు సాగు చేస్తే 30 ఏళ్ల పంటదిగుబడి వస్తుందని, రైతులు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుచేయాలని సూచించారు. ఈక్రమంలో ప్రభుత్వం రైతులకు సాగు ఖర్చు కింద నాలుగేళ్లు ఎకరానికి ఏడాదికి రూ.4.200 ప్రభుత్వం ఇస్తోందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటరెడ్డి, రైతు సమన్వయ కమిటీ మండల కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పాపయ్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కల సాగు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామంలో నల్ల సత్యారెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను సర్పంచ్ దామెర విద్యాసాగర్‌రెడ్డి, ఏవో వంశీకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి రోహిత్ నాటారు. సుమారు మూడెకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటనున్నట్లు ఏవో పేర్కొన్నారు. గట్టయ్య, ఏఈవోలు రాజశేఖర్, వంశీ, రైతుబంధు కోఆర్డినేటర్ సుధాకర్, పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు,రైతులు

రైతులకు అధిక లాభాలు

ఇల్లందకుంట: రైతులు ఆయిల్‌పామ్ పంటసాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏవో గుర్రం రజిత అన్నారు. మండలంలోని టీకుర్తిలో కూర జితేందర్ రెడ్డికి చెందిన మూడెకరాల భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. హెచ్ఓ ఐలయ్య, ఏఈవోఎస్ తిరుపతి, సంపత్, రాకేశ్, మౌనిక, సర్పంచ్ వాసుదేవరావు, ఎంపీటీసీ మోటపోతుల ఐలయ్య, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ యామ శ్రీనివాస్, ఏఈవో నీల తిరుపతి, ఫీల్డ్‌ఆఫీసర్ బి.వేణు, రైతులు నరోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

దొంగతనాలపై ప్రత్యేక నిఘా

కరీంనగర్‌క్రైం:కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నెల రోజుల వ్యవధిలో ఏడుగురు దొంగలను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సీహెచ్.నటేశ్ తెలిపారు. ఇటీవల గణేశ్‌నగర్‌లోని రామేశ్వరాలయంలో జరిగిన దొంగతనంలో నిందితుడు రాతు పవన్ కోసం నాందేడ్‌కు ప్రత్యేక బృందాలు పంపించి, కేవలం మూడు రోజుల్లోనే పట్టుకున్నామన్నారు. గుడిలో చోరీచేసిన నిందితుడే ఒక వైన్స్ షాపులో నగదు దొంగలించినట్లు వెల్లడించారు. సుమారు 150 సీసీ కెమెరా ఫుటేజీలు చూసి నిందితుడి ఆచూకీ కనిపెట్టి పట్టుకున్నామన్నారు. దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను వేగంగా పట్టుకొని అరెస్టుచేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. అనుమానంగా ఎవరైనా తిరిగినా వెంటనే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. బైకులు, సెల్‌ఫోన్లు దొంగతనాలు వరసగా చేసిన వారిని గుర్తించి వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించామని తెలిపారు. పోచమ్మవాడలో ఒక ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారని అక్కడ ప్రాంతవాసులు తెలుపడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నామని అన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకుప్రజల భద్రతకు ఎల్లవేళలా కృషిచేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- రూ.1.1 కోట్లు పెండింగ్ బిల్లులు
- పేరుకుపోతున్న కస్టమర్ చార్జీలు
- అవగాహనలోపంతో చెల్లించని రైతులు



కరీంనగర్‌రూరల్: విద్యుత్‌శాఖకు కస్టమర్ చార్జీల బకాయిలు భారంగా మారాయి. వీటిని రాబట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్ సిబ్బంది రైతుల నుంచి బకాయి వసూలు చేస్తున్నారు.

కస్టమర్ చార్జీల పేరిట వసూలు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ప్రతీ విద్యుత్ మోటారుకు రైతుల నుంచి కస్టమర్ చార్జీల పేరిట నెలకు రూ.30 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేస్తోంది. కొంతమంది రైతులకు ప్రతినెలా వ్యవసాయ కనెక్షన్‌కు రూ.30 చొప్పున బిల్లు వస్తుందనే విషయం తెలియకపోగా మరికొందరు ఏడాదికి ఒకేసారి చెల్లిస్తామనే నిర్లక్ష్యంతో బిల్లులు చెల్లించకపోవడంతో పేరుకపోతున్నాయి. కరీంనగర్ డివిజన్ పరిధిలో మొత్తం 5,040 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. డిసెంబరు వరకు రూ.1.1 కోట్లు బిల్లులు బకాయిలున్నాయి. విద్యుత్ సంస్థ సైతం గృహావసర విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి నెలవారీగా ఇంటికి వెళ్లి బిల్లులను ఇస్తున్న తరహాలో వ్యవసాయ కనెక్షన్ల బిల్లు నెలనెలా రైతులకు ఇవ్వడం లేదు. ఏటా డిసెంబరులో బిల్లులు అందించి రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గ్రామాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించి వసూళ్లు చేపడుతున్నారు. బిల్లులు చెల్లించకుంటే రైతుల విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే పలువురు రైతులు కస్టమర్ చార్జీలను చెల్లించకపోవడంతో బకాయిలు రూ.లక్షల్లో పేరుకపోతున్నాయి. కొందరు బడా రైతుల బిల్లులు రూ.వేలల్లో ఉన్నప్పటికీ విద్యుత్‌సిబ్బంది వసూలు చేయలేని పరిస్థితి నెలకొంది.

చార్జీలు చెల్లించి సహకరించాలి

రైతులు కస్టమర్ చార్జీలు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకపోయాయి. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి గతేడాది నుంచి బకాయిలున్నాయి. గతనెల 31వరకు బకాయిల్లో 50శాతం వసూలు చేశాం. ఫిబ్రవరి నెలాఖరు వరకు మిగితా బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. బకాయిలు చెల్లించి సహకరించాలి.

– కొల్పుల రాజు, ఏడీఈ, కరీంనగర్‌రూరల్

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ
- ఐదెకరాల స్థలం చూపాలని స్థానికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పట్టణ ప్రజలు

చొప్పదండి: పట్టణ శివారులోని గుమ్లాపూర్ రోడ్డులో శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ కోరారు. కొందరు వ్యక్తులు శ్మశానవాటిక స్థలాన్ని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు బుధవారం శ్మశానవాటిక స్థలం వద్ద నిరసన తెలిపారు. శ్మశానవాటిక వద్ద పనులు చేపడుతూ.. ప్రహరీ నిర్మిస్తుండగా పనులు అడ్డుకున్నామని మళ్లీ సర్వేపేరుతో స్థలం కబ్జాకు యత్నించడం సరికాదని చైర్‌పర్సన్ అన్నారు. గతంలో శ్మశానవాటికకు కేటాయించిన ఐదెకరాల స్థలం చూపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వభూమిని కబ్జా చేసేందుకు యత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ప్రభుత్వ స్థలం పక్కనే సర్వేనంబర్‌కు హద్దులు కేటాయించాలని ప్రైవేటు వ్యక్తులు అధికారులకు దరఖాస్తు చేశారు. ఐదెకరాల ప్రభుత్వ స్థలం శ్మశానవాటికకు గతంలో కేటాయించారని, ఆ స్థలం హద్దులు చూపించాకే ఇతరుల భూమిని సర్వే చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

పీఏసీఎస్ సంఘం పనితీరు భేష్



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు

చొప్పదండి: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పనితీరు ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోందని మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు నిజాంపాషా అన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ కేంద్రాన్ని బుధవారం పీఏసీఎస్ జిల్లా అధ్యక్షులతో కలిసి సందర్శించారు. సంఘం పనితీరును, అభివృద్ధిని, కార్యకలపాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాల పనితీరును చైర్మన్ వెల్మ మల్లారెడ్డి సందర్శకులకు వివరించారు. సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సంఘం ఇస్తున్న రుణాలపై పీడీసీ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, జీఎం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, గుర్రం ఆనందరెడ్డి, లంబు రాజిరెడ్డి, దుర్గం పద్మ, మల్లారెడ్డి, కొమురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ పకడ్బందీగా నిర్వహించాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

హుజూరాబాద్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘కంటివెలుగు’ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జువేరియా అన్నారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డులో ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటిపరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమాన్ని అమలుచేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ సాజీద్, జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, అస్తమాలిడ్ రఘోత్తంరెడ్డి, వైద్యాధికారులు వెంట ఉన్నారు.

కంటివెలుగు వైద్యశిబిరం ఏర్పాటు పరిశీలన

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో కంటివెలుగు శిబిరం ఏర్పాట్లను జిల్లా వైద్యాధికారి జవేరియా బుధవారం పరిశీలించారు. ఈనెల 19 నుంచి నిర్వహించే కంటివెలుగు వైద్యశిబిరాన్ని పట్టణ, గ్రామీణ, మండలప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని, ప్రజలు ప్రజాప్రతినిధులు, భాగస్వాములవ్వాలని కోరారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు తరలిన నాయకులు



ఖమ్మం సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంట: ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవిర్భావ సభకు జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ ఆధ్వర్యంలో మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దేశంలోనే బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు నూకలు చెల్లాయన్నారు. తెలంగాణ మోడల్‌గా దేశంలో అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ పోల్సాని తిరుపతిరావు, పాపక్కపల్లి సర్పంచ్ మహేందర్, తనుగుల సర్పంచ్ వసంత రామస్వామి, దళితబంధు కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మైస మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు ఖమ్మం బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చిగురుమామిడి బస్టాండ్ నుంచి బస్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. బహిరంగ సభకు తరలివెళ్ళిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శులు మంకు శ్రీనివాస్‌రెడ్డి, పెసరి రాజేశం, ప్రచారకార్యదర్శి బెజ్జంకి రాంబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు అనుమాండ్ల సత్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు పెద్దపల్లి అరుణ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు బోయిని మనోజ్‌కుమార్, సోషల్‌మీడియా కన్వీనర్ బొట్ల రవీందర్, నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రామ నర్సరీ పరిశీలన



రామడుగు: మండలకేంద్రంలోని గ్రామ నర్సరీని బుధవారం జెడ్పీ సీఈవో ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో నాటిన మొక్కలు, వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రామడుగులో గ్రామనర్సరీ బాగుందని సంతోషించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంను తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ పంజాల ప్రమీల, మాజీ సర్పంచ్ జగన్ మోహన్‌గౌడ్, ఏపీఎం రాధ పాల్గొన్నారు.

రూ.15వేల ఆర్థిక సాయం



ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడుకు చెందిన కొండ మల్లయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి ప్రమాదానికి గురికాగా, ఆస్పత్రి ఖర్చులకు తాడి కార్పొరేషన్ నుంచి ప్రభుత్వసాయాన్ని చైర్మన్ బుర్రా వెంకటేశం ఐఏఎస్ రూ.15వేలు మంజూరు చేశారు. సహకరించిన జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజీమనోహర్‌రావు జూనియర్ అసిస్టెంట్ ఎండీ.యూసుఫ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గణపతి రాజ్‌గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

21న ‘చలో రవీంద్రభారతి’

విద్యానగర్(కరీంనగర్): 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న చలో రవీంద్ర భారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో వివరాలు వెల్లడించారు.